
# పెద్ద కథ ప్రారంభం!




'సుమీ! సుమీ! మన రాజాకి హైద్రాబాద్ ట్రాన్స్‌ఫర్ అయిందట ఉత్తరం రాశాడు.' సారథి సంతోషంగా సుమిత్రని పిలిచాడు.

'ఏదీ ఉత్తరం యిలా యివ్వండి. ఎప్పుడొస్తున్నాడట?' వంటగదిలో పని చేసుకుంటున్న సుమిత్ర సంభ్రమంగా వచ్చింది.

'రేపు వస్తున్నాడు. ఏమోయ్! పెద్దమ్మీ చెల్లాయి, ఉత్తరం వ్రాయగానే వచ్చేసిందని తెగమురిసి పోతున్నావుగా! మా తమ్ముడు నేను ఉత్తరం వ్రాయకుండానే వచ్చేస్తున్నాడు.' ఉత్తరం అందిస్తూ సారథి కవ్విస్తున్నట్లు అన్నాడు.

'మీకు అలాంటి పక్షపాతమేమున్నా ఉందేమో! నాకు సంధ్య వచ్చిందంటే ఎంత సంతోషంగా ఉందో, రాజా వస్తున్నాడన్నా అంత సంతోషమే!' సుమిత్ర నవ్వుతూ ఎదురుదెబ్బ తీసింది. సారథికూడా నవ్వేశాడు.

• • •

రైలురావడం లేట్ అని తెలియగానే రాజాకి నీరసం వచ్చేసింది. విసుగ్గా ప్లాట్‌ఫామ్‌మీద పచార్లు చేశాడు. మనసెప్పుడో రెక్కలు కట్టుకొని, అన్న, వదినలదగ్గర వాలింది. 'ఉద్యోగం! ఉద్యోగం!' అని దొరకనన్నాళ్ళు తెగకలవరించాడు. ప్రొబేషనరీ ఆఫీసర్‌గా చేరినప్పటినుండీ ట్రాన్స్‌ఫర్ల మీద తిరగడమయిపోయింది. సంవత్సరం తర్వాత అన్న, వదినలని చూడటమేకాదు, ఇంకో ఆరు నెలలు గ్యారంటీగా వాళ్ళదగ్గర ఉండబోతున్నాడు. 'ఈ తలంపుతో మనసు ఆహ్లాదకరమయింది రాజాకి! 'వెధవరైళ్ళు! ఎప్పుడూ లేట్‌గానే వస్తాయి. చిరాకు పడ్డాడు. సిగరెట్ వెలిగించుకుంటూ యథాలాపంగా ప్రక్కకి చూసిన రాజా ఉలిక్కిపడ్డాడు. దూరంగా, ఎవరో ఇద్దరు నిల్చొని మాట్లాడుకుంటున్నారు. అందులో అమ్మాయి మొహం రాజాకి స్పష్టంగా కన్పిస్తోంది. అతడు మాత్రం రాజావైపు వీపుపెట్టి నిల్చొనున్నాడు. 'ఆ అమ్మాయి!... అవును మంజూలే! సందేహంలేదు' అనుకోకుండా చూసినందుకు కొంచెం ఆశ్చర్యమన్పించింది. ఇంతలో రాజాకి అనుమానం వచ్చింది. 'తనని మంజుల చూసిందా?' ఎందుకో తనని చూసేవుండచ్చన్పించింది రాజాకి. అక్కడ నిల్చోవడానికిక మనస్కరించలేదు. బుక్స్ కొనుక్కోవడానికి బుక్ స్టాల్‌వైపు నడిచాడు. [illegible]

చేసుకోవాలని మహోత్సాహపడ్డాడుకేంటి! పూర్ ఫెలో...' వాళ్ళకి కొంచెం దూరంగా ప్రక్కగా, వెళ్తున్న రాజాకీమాటలు విన్పించి ఉలిక్కిపడి తలెత్తాడు. మంజుల నవ్వుతోంది—అతి నిర్లక్ష్యంగా, గర్వంగా! అతడు రాజాకేసి, కుతూహలంగా చూశాడు. రాజా దిమ్మెరపోయాడు. అతడు దిగ్భ్రమ నుంచి తేరుకునేలోపల, పెద్దశబ్దం చేసుకుంటూ రైలువచ్చి ఆగింది. జనం హడావుడిగా పరిగెత్తుతున్నారు. ఆ గుంపులో మంజులా, అతడు ఎక్కడ కలిసిపోయారో రాజాకి కన్పడలేదు. సీటు వెతుక్కొని, కొంచెం విశ్రాంతిగా కూర్చొన్న రాజాకి, మంజుల మాటలు గుర్తుకువచ్చాయి. చిత్రమైనవ్వొకటి లీలగా, రాజా పెదాలమీద నర్తించింది. 'మంజుల మారలేదు. అప్పుడెంత గర్వంగా, నిర్లక్ష్యంగా ఉండేదో, ఇప్పుడూ అలానే ఉంది. నిజాన్ని మరుగు పరచి, తను వింటుండగానే, తనగురించి. హేళనగా మాట్లాడటానికి ఎంత ధైర్యం! మొదటినుంచీ యింతే!...' రాజా మనసు గతంలోకి జారిపోయింది.

* * *

'ఒరే. కొంచెం జోరుతగ్గించి నడవరా! కబుర్లు చెప్పుకుంటూ సర్దాగా వెళ్ళచ్చు' ముందు విసురుగా వెళ్తున్న మంజులని తప్పిస్తూ అన్నాడు రామకృష్ణ. అప్పటికి రాజా రెండుసార్లు చెప్పి చూశాడు. రామకృష్ణ వినలేదు. నెమ్మదిగా, తమ దారిన తాము వెళ్లిపోయే ఆడపిల్ల జోలికి వెళ్ళడుకాని, రోడ్డుమీద వెళ్ళేవాళ్ళంతా, తననే చూస్తారని, తనగురించే మాట్లాడుకుంటారని, అపోహపడి విరుచుకుపడే మంజులలాంటి వాళ్ళని తప్పించటమంటే మహా సర్దా రామకృష్ణకి. రాజా ఎదురుచూస్తున్న పిడుగు పడనే పడింది. ఎటొచ్చీ దారితప్పి రాజా మీదే పడింది.'

'సిగ్గులేదూ! ఆడపిల్లల వెంటపడటానికి ఈసారిలా చేస్తే...' కాలి చెప్పువైపు చూపిస్తూ, రామకృష్ణ నేమంటానికి ధైర్యం చాలక, రాజాని బెదిరించింది. మొదట విస్మయం కల్గినా, కోపంతో. ఆత్మాభిమానం దెబ్బతిన్నట్లయి, ముఖం ఎర్రబడింది రాజాకి.

'నాకాలికే ముందోచూడు!' నల్లగా, నిగనిగలాడే హాయింటెడ్‌షూని చూపిస్తూ, 'అతి నిర్లక్ష్యంగా అన్నాడు రాజా! కదిలి వెళ్ళిపోతున్న రాజానిచూస్తూ, ఒక్క క్షణం, అలాగే నిర్ఘాంతపోయి నిలబడింది మంజుల! అవమానంతో కృంగిపోతూ నిలబడ్డ మంజులని చూసి, కొంచెం బాధపడ్డాడు రాజా. 'తనలా అనకుండా ఉండాల్సింది. ఎంతైనా ఆడపిల్ల!'

* * *

రాజా అంటే కాలేజిలో ఆడపిల్లలకి మంచి ఎట్రాక్షన్. గ్లామర్ ఉండేవి. కాలేజీ ఫంక్షన్స్‌లో, అతడి చుట్టూ భ్రమరాల్లా తిరిగే అమ్మాయిల్ని చూసి, అతడంటే, చాలా మంది అబ్బాయిలు ఈర్ష్యపడేవారు, అతనంత అందంగా, ఆ కాలేజీలో ఎవరూలేరని కాదు. అతడి మాటల్లో, చేతల్లో, చిందులేసే చైతన్యం, చిలిపిగా నవ్వే అందమైన అమాయకత్వం అన్నిటికీ మించిన. అతడి స్నిగ్ధ స్వభావం—ముఖ్యంగా ఆడపిల్లలపట్ల, ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ. అతడి మాటల్లో తొంగి చూసే మృదుత్వం—అమ్మాయిల హృదయాల్లో, 'హీరో వర్షిప్'ని పెంచింది.

తన చిరునవ్వు కోసం, పలకరింపుకోసం అబ్బాయిలందరూ పడిగాపులు పడతారనే అహంకారంతో, మగవాళ్ళందర్నీ దులపరించి పారేసే కాలేజీ బ్యూటీ మంజుల ఆత్మ విశ్వాసానికి. రాజా ప్రవర్తన దెబ్బతీసి నట్లయింది.

'ఇంతవరకూ తన వైపు కన్నెత్తిచూడ లేదు. కనీసం పలకరించే ప్రయత్నం కూడా చెయ్యలేదు. ఆడపిల్లలతో మాట్లాడని బుద్ధావతారమూ అనుకుంటే అదీకాదు. వనజా, శ్యామలావాళ్లు పలకరించి నపుడెల్లా, ఎంతో చక్కగా మాట్లాడు తాడని వాళ్ళు తెగ మెచ్చుకుంటారు. తనే బాగా చదువుతాడని, అందంగా వుంటాడని గర్వం! ఇతగాడి అంతేమిటో. ఆ బెట్టేమిటో చూడాలి?' కసిగా, పంతం పట్టినట్లే అనుకుంది మంజుల.

* * *

ఫంక్షన్ అయిపోయేప్పటికి బాగా చీకటి పడిపోయింది. రోజూ తనకు తోడుగా ఉండే తన జూనియర్ శాంతి ఆరోజు రాలేదు. గేటుదగ్గర నిలబడ్డ రాజాని చూడగానే. మంజులకో ఆలోచన తట్టింది. 'ఇంటి వరకూ తోడురమ్మని అడిగితే?' అతడితో పరిచయం కల్గించుకోవటానికి ఇదే మంచి అదను. నెమ్మదిగా ఆవైపు వెళ్లబోతున్న మంజులకి, రామకృష్ణ, రాజా దగ్గరకి వచ్చి ఏదో మాట్లాడటం కన్పించింది. రామకృష్ణని చూడగానే సగం నీరసం వచ్చేసింది మంజులకి. 'అంత మంచి తెలివైనవాడు. చాలా హుందాగా, గంభీరంగా ఉండే రాజాకీ, అష్ట మాషిగా, అల్లరిగా గడిపే రామకృష్ణకి. అంతమంచి స్నేహం ఎలా ఏర్పడిందో? ఐనా యితడొకడు! అస్తమానం రాజాని అంటి పెట్టుకునే వుంటాడు' కొంచెం చిరాకన్పించింది మంజులకి. మంజుల, విసురుకి, తిట్లకి భయపడనివాడు. తిట్టిన కొద్దీ మరింత కవ్వించేవాడు రామకృష్ణ ఒక్కడే! అందుకే అతడంటే కొంచెం జంకు 'సరే! ఒక్క దెబ్బకి, యిద్దరి పనిపట్టాలి?' చిన్నగా నవ్వుకొంది.

'ఎక్స్‌క్యూజ్‌మీ?'

ఏదో చాలా సీరియస్‌గా మాట్లాడు కుంటున్న, రాజా, రామకృష్ణ ఉలిక్కి పడ్డారు. ఎదుట నిల్చొని చిరునవ్వులు చిందిస్తున్న, మంజులని చూడగానే, ఆశ్చర్యంతో మతిపోయి నట్లయింది, యిద్దరికీ.

'బాగా చీకటిపడింది' కొంచెం యింటి వరకూ తోడువస్తారా...'

అప్పటికి యిద్దరూ తేరుకున్నారు. మృదువుగా ఉన్న మంజుల ధోరణి చూడగానే రామకృష్ణకి ఉత్సాహం కల్గింది. 'విత్‌ప్లెజర్' వెంటనే అంగీకారం తెలిపేశాడు. రాజా ఏం మాట్లాడలేదు. వారిలో మంజులే మాట్లాడింది.

'మొన్న జరిగిన దానికి ఏమీ అనుకోకండి.' క్షమాపణ కోరుతున్నట్లడిగింది. రాజా కొంచెం తడబడ్డాడు. 'ఫర్వాలేదులెండి, నేను కూడా అలా అని వుండాల్సింది కాదు.' చాలా సిన్సియర్‌గా అన్నాడు. ఈ ధోరణి మంజులకి చాలా ఎన్‌కరేజింగ్‌గా అన్పించింది. తర్వాత దారిలో ముగ్గురూ, చాలా కబుర్లు చెప్పుకొన్నారు.

* * *

రాజా, రామకృష్ణ కాంటిన్‌లో కూర్చుని కాఫీ తాగుతున్నారు. మంజుల, శాంతిని, యింకో యిద్దరిని వెంటబెట్టుకొని సరాసరి రాజావాళ్ల దగ్గరికి వచ్చింది.

'మొన్న జరిగిన కాలేజ్‌డేలో మీ డాన్స్ చాలా బావుంది. రాజా మనస్ఫూర్తిగా అభినందించాడు.

'థ్యాంక్స్' నవ్వింది. ఎందుకో రామ కృష్ణకి, ఎక్కడో [illegible]

గర్వం గోచరించింది.

'అబ్బ! ఆ శామ్యూల్ పాటమాత్రం వినలేక చచ్చామనుకోండి! సాహిత్యాన్ని చిత్రవధ చేసి మరీపాడాడు!' అందరూ గట్టిగా నవ్వేశారు, శామ్యూల్ పాటని తల్చుకొని దూరంగా కూర్చొని కాఫీ తాగుతున్న ఫైనల్‌స్టూడెంట్స్ సుమిత్ర, మాధురి ఇదంతా గమనిస్తున్నారు.

'ఇదివరకు రాజా చాలా బుద్ధిమంతుడిలాగా ఉండేవాడు సుమిత్రా! ఈ మధ్య మంజులతో మరీ అతిగా ప్రవర్తిస్తున్నట్లున్నాడు. ఐనా, రామకృష్ణలాంటి వాడితో తిరిగితే యిలాగే తయారవుతారు ఎలాంటి బుద్ధిమంతులు కూడా.' క్రొత్తగా ఫైనలియర్‌లో చేరిన సుమిత్రతో రాజామీద కామెంట్ చేసింది మాధురి, సుమిత్ర ఏం మాట్లాడలేదు.

* * *

'థాంక్స్ రాజా!... అడుగున మంజుల సంతకం చూడగానే రాజా అదిరిపడ్డాడు. ఆ రోజే లోకల్‌పోస్టులో వచ్చింది లెటర్. మంజుల ధైర్యానికి విస్తుపోయాడు. 'ఐ లవ్‌యూ!' ఉత్తరంలోని మాటలు పదే పదే గుండెల్లో ప్రతిధ్వనించ సాగాయి. ఇన్నాళ్లూ తమిద్దరిదీ స్నేహమే అనుకుంటున్నాడు తను. కాని యీరోజు వేరే క్రొత్త నిర్వచనం యిచ్చింది మంజుల. ప్రథమంగా మంజుల రేకెత్తించిన, యీ అనుభూతి, రాజాకి చాలా గమ్మత్తుగా, అదోరకమైన హాయిని కల్గించింది. వెంటనే రిప్లయి వ్రాశాడు.

'రాజా! నేనొక మాట చెప్తాను వింటావా?' ఎప్పుడూ నవ్వుతూ, తుళ్ళుతూ తిరిగే రామకృష్ణ, ఆ రోజు చాలా సీరియస్‌గా అడిగేప్పటికి రాజా ఆశ్చర్యపోయాడు.

'ఏ మాట నేనెప్పుడు వినలేదురా?' నవ్వుతూ రామకృష్ణ భుజం మీద చేయి వేశాడు.

'మంజులతో నీ పరిచయం తగ్గించుకోవడం మంచిది.' రామకృష్ణేనా, యీ మాటలనేది నివ్వెరపోయాడు రాజా.

'[illegible]! నాకెందుకో మంజుల నీపట్ల స్వచ్ఛమైన ప్రేమని చూపిస్తున్నదంటే నమ్మకం కుదరడం లేదు. ఆ అమ్మాయి నీతో మాటల్లో, చేతల్లో ఎక్కడో గర్వం, నిర్లక్ష్యం కన్పిస్తుంటాయి. నువ్వేమన్నా, ఆ పిల్లని పెళ్ళిచేసుకుందామనుకుంటున్నావేమో! ఆ అమ్మాయికి, అందం తప్పిస్తే, నీ భార్యగా ఉండదగ్గ లక్షణాలేవీ లేవు. అలాంటి పిచ్చి పిచ్చి వూహాలు కట్టిపెట్టి, యిక నీ ప్రేమకి గుడ్‌బై కొట్టేయి. ఇప్పటికే కాలేజీలో ఉన్న రూమర్స్ వింటుంటే, నాకే బాధన్పిస్తోంది. అసలు నా పొరపాటుందనుకో!' ఆవేశంగా అంటున్న రామకృష్ణకి బదులు చెప్పలేకపోయాడు రాజా!

అప్పుడే యవ్వనం రేకెత్తిస్తున్న చిలిపి వూహాల సందడిలో రాజా, మంజుల అపురూప సౌందర్యపు మైకంలో పడ్డమాట వాస్తవం. కోరి మంజుల, అతణ్ణి కవ్వించి, చాలా వరకు ప్రభావితుణ్ణి చేసింది. రాజాని మంజుల, తన అందంతో, చిలిపి పనులతో, ఆకర్షించడానికి చేసిన ప్రయత్నాలని, రాజా రెస్పాన్స్‌ని, కొన్ని వందల జతల కళ్ళు, అత్యంతాసక్తిగా, అతి జాగ్రత్తగా పరిశీలించాయి. అందులో అబ్బాయిల కళ్ళు, రాజాకేసి, ప్రశంసా పూర్వకమైన ఈర్ష్యతో చూస్తే, అమ్మాయిల కళ్ళు మంజుల వైపు అసూయా బాణాల్ని సంధించాయి. అబ్బాయిల్ని, అతి తృణప్రాయంగా తీసిపారేసే కాలేజి బ్యూటీ మంజుల తనంతటు తానుగా, తన స్నేహం కోరినందుకు రాజా, అదోరకమైన గర్వంతో, అమాయకత్వంతో పొంగిపోతే అందరికీ హీరోలాంటివాడయినరాజాని, తన అందంతో బందీ చెయ్యగల్గినందుకు మంజుల మురిసిపోయింది.

'అదిగోరా! మన లవ్‌బర్డ్స్ ఏమిటో మాట్లాడుకుంటున్నారు.' శివరాం ముకుందంతో హేళనగా అంటున్నాడు. ముకుందం అదేదో పెద్ద జోక్ అన్నట్లు విరగబడి నవ్వాడు. మంజుల విసురుగా వెళిపోయింది. రాజా ముకుందం కేసి తీవ్రంగా చూశాడు. ముకుందం బెదిరిపోయి నవ్వాపేశాడు.

'రాజా—మంజుల' బోర్డు మీద పేర్లు చూసి, అవాక్కయి నిలబడిపోయాడు రాజా! రామకృష్ణ కళ్ళెర్రబడాయి. 'ఇదంతా ఆ శివరాంగాడి పనయి వుండాలి!' పళ్ళు కొరికాడు. బోర్డు తుడిచేసి వచ్చి కూర్చున్న రామకృష్ణని చూసి కిమ్మనలేదు శివరాం. లోపలికి వస్తున్న లెక్చరర్ని చూసి, ఏదో అనబోయిన రామకృష్ణ ఊరుకున్నాడు.

* * *

ఉద్రేకపు వేడితగ్గి, వాస్తవిక పరిస్థితులు చురుక్కు మనడంతో, రాజా, మంజుల, కొంచెం పరిస్థితుల్ని అర్థం చేసుకున్నారు. ఇద్దరూ, మాట్లాడటం తగ్గించుకున్నారు. ఇద్దరూ ఫైనల్‌లోకి వచ్చారు.

* * *

మర్నాటినుంచీ ప్రిపరేషన్ హాలిడేస్ యిస్తున్నారు. ఇహ మంజులతో చివరిసారిగా మాట్లాడాలనుకున్నాడు రాజా. మంజుల పెళ్ళి, యింకో రెణ్ణాల్లలో జరుగుతుందనేవార్త తీసుకొచ్చాడు రామకృష్ణ. మొదట మనసు దెబ్బతిన్నట్లనిపించింది, 'మంజులని తను చేసుకోవాలనుకున్నా, యింకో రెండు మూడు సంవత్సరాలకి, చదువు పూర్తయి, ఉద్యోగం దొరికితేకాని కుదరదు. పోనియ్! ఇంతవరకూ, యిద్దరూ పెళ్ళి గురించి అనుకోలేదుగా! బహుశా మంజులకూడా పెద్ద పట్టించుకోదేమో! తన పెళ్ళివిషయం నిజమే అయితే, ఆ అమ్మాయి సుఖపడాలనే తను మనస్ఫూర్తిగా కోరుకుంటాడు. తమిద్దరి స్నేహం, ఒక మధురానుభూతిగా మిగిలిపోతుంది' ఈ భావనతో రాజా మనసు కొంచం వూరట చెందింది.

'మంజులా!' ఏదో ఆలోచిస్తూ నడుస్తున్న మంజుల రాజా పిలుపుకి వెనక్కి తిరిగిచూసి ఆగింది. మంజుల ప్రక్కనే నడుస్తూ అడిగాడు రాజా.

'ఫైనల్ ఎగ్జామ్స్ దగ్గరకు వచ్చేసాయి. బాగా చదువుతున్నావా?'

'ఊ!' ముభావంగా అంది మంజుల. రాజా కొంచెం చకితుడయ్యాడు. కాసేపు ఊరుకొని, తనే మళ్ళీ మాట్లాడాడు. 'ఇన్నాళ్ళూ కలిసి స్నేహంగా తిరిగాం. ఇక నుంచీ మనదారివేరు, అనుకుంటే ఎందుకో బాధగా, దిగులుగా అన్పిస్తుంది, నీకేమీ అన్పించడంలేదా మంజులా?' నాయకంగా, అతినిజాయితీగా అడిగాడు రాజా.

'ఎందుకన్పించదూ? చాలా చాలా అన్పిస్తోంది.'

వ్యంగ్యం స్పష్టంగా తెలుస్తోంది కంఠంలో. విస్మయంగా మంజులకేసి చూశాడు రాజా.

# వదినగారి చెల్లెలు

కూసింత మరింత రెచ్చగొట్టింది మంజుల.

'నువ్వొట్టి మోసగాడివి. ప్రేమించానని, అన్నీ అబద్ధాలు చెప్పి, యిప్పుడు నీ దారిన నువ్వు చల్లగా జారుకుంటున్నావా?' చాలా తీవ్రంగా, పదునుగా అడిగాననుకొంది.

రాజా కనుబొమలు ముడిపడ్డాయి.

'నువ్వేం మాట్లాడుతున్నావో నా కర్థం కావడంలేదు.'

'అర్థంకావు. ఇప్పుడెందు కర్థమవుతాయి? నా తోకలిసి తిరిగినన్నాళ్లూ బాగానే అర్థ మయ్యాయి. నీ కీ రోజు నా అనుభవాలన్నీ అయోమయంగా తోస్తున్నాయి.' కోపంగా [illegible] రాజా కి [illegible] అమాయకంగా అన్నాడు. 'అసలు [illegible] మాటగా [illegible] చెప్పు.'

'ఇంకా ఏమిటిగాని? అమాయకురాలైన అమ్మాయితో పరిచయం పెంపొందించుకోవడం తప్పుకాదా? నా మీద వచ్చిన రూమర్స్‌కి నీ బాధ్యతలేదా? ప్రేమించానని ఉత్తరాలు రాసి, ఇప్పుడు పెళ్లి చేసుకోకుండా పారి పోవడం పిరికివాడి లక్షణంకాదా అని అడుగు తున్నాను. బహుశా యిప్పుడు బాగా అర్థ మయ్యాయనుకుంటాను' తన వాగ్ధాటికి మనసులో తననే అభినందించుకొంది.

రోడ్డుమీద జనసంచారం అట్టేలేదు. వీధి దీపాల వెలుగు మందంగా ప్రసరి స్తోంది. నడక ఆపి, రాజా ఒక్కక్షణం నిర్ఘాంతపోయి చూశాడు. మరుక్షణంలోనే బిగ్గరగా నవ్వేశాడు. అతికష్టంమీద నవ్వు ఆపుకుంటూ,

'వారెవా! మంజూ ఏమన్నావ్? మళ్లీ అను.' ఆగి, ఆగి, నవ్వాడు. మంజుల తొక్కతొక్కిన త్రాచులా లేచింది.

'ఏం? జీవితాలతో ఆటలాడుకోవడం అంత నవ్వుగా ఉందా? ఇప్పుడు నువ్వు రాసిన ఉత్తరాలు పదిమంది ముందు పెట్టి నవ్వుల పాలు చెయ్యగలను.'

రాజాకి, జీవితంలో మొదటిసారిగా మంజులమీద అసహ్యం కలిగింది. 'పిచ్చి పిచ్చిగా మాట్లాడకు. ఉత్తరాలతో, చెయ్యి తలచుకుంటే, నేనూ, నిన్నుస్సరిపెట్టి, నీ జీవితాన్ని నరకం చెయ్య గలను. కాని అలాంటి ఆలోచనలంటేనే [illegible] అసహ్యం నాకు. నువ్వు నన్ను రెచ్చ

గొట్టి, నా స్వభావానికి విరుద్ధమైన మాటల్ని అనిపిస్తున్నావ్. మొదట ఎవరు కోరి కావాలని పరిచయం చేసుకొంది? ఎవరు ఉత్తరాలు రాసింది? ఇవన్నీ నిజంగా తెలి యకే మాట్లాడావా? రూమర్స్ మనిద్దరి మీదా వచ్చాయి. దానికి యిద్దరి బాధ్యతా ఉంది. నేను ఒప్పుకుంటున్నాను. ఇన్నాళ్ల మన పరిచయంలో పెళ్లి ప్రసక్తి వచ్చిందా? నువ్వెప్పుడన్నా పెళ్లి చేసుకుందాం, అని అడి గావా? సరే, నేనిప్పుడడుగుతున్నాను. నేను బి. ఎ. పాసవగానే, ఏదో ఒక ఉద్యోగం కోసం ప్రయత్నిస్తాను. ఉద్యోగం దొరగ్గానే నిన్ను పెళ్లిచేసుకుంటాను. నువ్వు కోరినవి నేనివ్వలేను కాని, నీ మనసు నొప్పించ కుండా చూసుకుంటాను. కాదూ, యిప్పుడే చేసుకుందాం, అన్నా నేను సిద్ధమే! నీ జీవితంతో నేను ఆటలాడుకొన్నానని నాపైన నేరం మోపావు. అందుకే నిజం ఎంత వున్నా, నేనలాంటి వాడినికాదని నిరూపించు డానికే నా ప్రయత్నం. మరి ఏమంటావ్?' సమాధానం కోసం ఎదురు చూశాడు. మంజుల ఆరోపణలు, రాజా మనసుకి పెద్ద అఘాతాన్నే కలిగించాయి.

మాటగా అడిగిన యీ ప్రశ్నకి మంజుల తడబడింది. జవాబు కోసం వెతు క్కుంది. 'రాజా యిలా అడుగుతాడని తను ఆశించలేదు. ఇప్పుడు రాజాని పెళ్లి చేసు కుంటే తను చాలా అవస్థపడాలి. ఉద్యోగం దొరుకుతుందని నమ్మకమేమిటి? దొరికినా, చాలీచాలని బ్రతుకులు గడపాలి. దీనికన్నా, నాన్న చూసిన డాక్టర్ని చేసు కుంటేనే హాయి. ఎలాంటి సమస్యలు పీడించవు. రాజా పట్ల తనకు ప్రేమ లేదా? మొదట పంతంగా, అతడ్ని ఏడిపిం చాలని పరిచయం చేసుకుంది. కాని, తనకు తెలియకుండానే అతడి ఆకర్షణలో పడింది. ఈ ఆకర్షణ నుండి విముక్తి పొందాలని వివేకం సచ్చచెప్తున్నా, హృదయం కొంచెం ఘర్షణ పడుతోంది. తను రాజాని చేసుకో కుండా వుంటే, తనుకోరుకున్న జీవితం తనకు లభిస్తుంది. రాజా ఉన్నతికి తను అడ్డురాదు. ఈ ఆలోచనతో మంజుల మనసు తేలికపడింది. రాజా ఉన్నతి కోసం తన ప్రేమను త్యాగం చెయ్యబోతున్నందుకు

గర్వపడిందీ; పాపం, మంజులకు; ఒక విషయం తెలియలేదు! మనిషి, తన లక్ష్యాన్ని సాధించుకునే ప్రయత్నంలో, తనకు తెలీకుండానే, తన ఆలోచనల్ని తదనుగుణంగా తన కనుకూలంగా మలచు కొని, వాటినే అతి ఉదాత్తమైనవిగా, యితరులకోసం అన్నట్లుగా ...భ్రమపడి మురిసిపోతాడని? స్వార్థం ఎప్పుడూ పై మెట్టులోనే వుంటుంది.

'ఏం? జవాబు చెప్పు.' రెట్టించి అడిగాడు.

రాజా ఆవేశం చూసిన మంజులకు తను 'ఊ' అంటే యీ క్షణంగా తనపాటున తీసికొనివెళ్లి పెళ్లి చేసుకుంటాడన్నంతభయం కల్గింది. ఏం చెప్పాలో చప్పన తట్టలేదు. 'తను రాజాని మాత్రం పెళ్లి చేసుకో టానికి సిద్ధంగాలేదు.' అది మంజుల మనసుకి స్పష్టంగా తెలుస్తూనే ఉంది. అలా అని పోటమిని ఒప్పుకోవటం బాధా కరంగా ఉంది. న్యాయానికి జరిగిన దానిలో తన ప్రమేయమే ఎక్కువ అని తెలిసినా, అలా అని ఒప్పుకోవడం మాత్రం అసంభవం అని తేల్చుకుంది. చటుక్కున రాజా దగ్గరకి వచ్చి, అతడి చెయ్యిని స్నేహపూర్వకంగా నొక్కుతూ, మార్దవం నిండిన స్వరంతో అంది. 'సారీ, రాజా! నిన్ను నిందించడం నాకు కష్టంగానే ఉంది. నా స్వార్థం కోసం నిన్ను పెళ్లి చేసుకొని, నీ భవిష్యత్తుని పాడుచెయ్యడం నా కిష్టంలేదు. నాకింతే ప్రాప్తం అని సరి పెట్టుకుంటాను. నీకోసం, త్యాగం చెయ్యడం కన్నా కావల్సిన దేముంది! నీకు బాధ కల్గిస్తున్నా ఒకమాట చెప్పాలి. ఇహనుంచీ మనం అపరిచితుల్లా మెలగడమే శ్రేయస్కరం 'గుడ్‌నైట్ ఎండ్‌గుడ్‌బై' ఇంకోమాట మాట్లాడటానికి రాజాకి అవకాశమివ్వకుండా, దూరంగా కన్పిస్తున్న తన ఇంటికేసి వడి వడిగా సాగిపోయింది.

రాజా విభ్రాంతుడై నిలబడ్డాడు ఒక్క నిమిషం. మరుక్షణం గట్టిగా నవ్వేశాడు. మంజుల మాటల్ని తలచుకొని, తలచుకొని, మరీ నవ్వాడు.

ఎలక్ట్రిక్‌పోల్ దగ్గర, ఒక్కడే నిలబడి నవ్వుతున్న రాజాని, దారినపోయే ఒకరిద్దరూ వింతగా చూశారు. రాజా అది గమనించి నవ్వాపేశాడు. సిగరెట్ పొగవదులుతూ ఇంటి

కున్నాడు.

'మంజూ! స్టేజీమీదే కాదు, నిజ జీవితంలో కూడా నువ్వు చాలా బాగా అభినయించగలవు సుమా!'


అతడి మనసిప్పుడెంతో తేలిగ్గా, స్వచ్ఛంగా బరువు తీరినట్లుంది. మంజుల అలా అన్నందుకు కాని, శాశ్వతంగా విడిపోయినందుకు కాని, అతడికేమీ బాధనిపించడం లేదు. అసలు, ఆ విషయం తనకెప్పుడూ సంబంధించనిదిగానే అతడికి తోచింది. తనలో తనే కొంచెం ఆశ్చర్యపోయాడు, తన మనసు అంత చంచలమైనదా? కాదు! మంజుల, యీ విధంగా ప్రవర్తించకుండా తన ప్రేమని, భావాలని, నిజాయితీగా వెల్లడించి వుంటే' నిన్ను విడిచి పెట్టడం దుర్భరం అయి వుంటే, తను చాలా ఎఫెక్ట్ అయివుండేవాడు. ఆఅమ్మాయికోసంఏదిచెయ్యడానికన్నా సిద్ధపడి వుండేవాడు. కాని పాపం, మంజుల తనకోసం తన ప్రేమని త్యాగం చేసింది. త్యాగం...!!!' గమ్మత్తుగా అన్పించి, నవ్వుకొని వెనక్కి తిరిగి నడకసాగించాడు. ఈ సంఘటనతో రాజాకి, తను మానసికంగా ఎంతో ఎదిగిపోయినట్లు, తనకు తెలియని కొన్ని జీవిత సత్యాలు అనుభవంలోకి వచ్చినట్లు అన్పించింది.

చివరి పరీక్షకూడా సంతృప్తికరంగానే వ్రాశాడు. రాజా హాలునుండి బయటికివచ్చేసి కాలేజ్ గ్రౌండులో చెట్టుక్రింద నిల్చొని, రామకృష్ణకోసం ఎదురు చూస్తున్నాడు. 'తనకు క్లాస్ తప్పకుండా వస్తుంది. తర్వాత ఎమ్. ఎ. చదవాలి. ఆపైన ఉద్యోగం. ఇంతేగా జీవితం! ఈ రోజుతో, తనకు, కాలేజీకి ఋణంతీరినట్లే. అన్నట్టు, రామకృష్ణకు యివాళ కెమిస్ట్రీ ఎగ్జామ్. పిచ్చి! ఎలా రాశాడో! వాడికీ, కెమిస్ట్రీకి శత్రుత్వం. చదివేరకమైతేగా! పాసవుతాడో, లేదో!' రామకృష్ణ పరీక్ష ఎలా రాశాడో, అనే ఆదుర్దాతో, రాజా ఎదురు చూడసాగాడు. దూరం నుండి, రామకృష్ణ పరుగెత్తుకుంటూ రావడం కన్పించింది. 'పరీక్ష బాగా వ్రాసుంటాడు. లేకపోతే, నీరసంగా తల వేళ్ళాడేసుకొనుండేవాడు.' రాజా సంతోషంగా రామకృష్ణకెదురుగా వెళ్ళాడు. 'ఏరా! పరీక్ష బాగా వ్రాశావా? నీ వాలకం అవునని చెప్తోందిలే,' అని కుతూహలంగా చూశాడు. రామకృష్ణ ఆగి, చెమట తుడుచుకుంటూ, ఆయాసం తీర్చుకోడానికి, ఒక్క క్షణం ఆగాడు. 'వెధవ పరీక్ష! దాన్నలా తగలడనియ్! తప్పడం గ్యారంటీ అని వ్రాసిస్తాను.' రాజా కళ్ళల్లో కోపం, బాధ తొంగి చూచాయి. 'నువ్వెంత తేలిగ్గా ఎలా తీసుకుంటావో నాకర్థం కాదురా! నీ బాధ్యత నువ్వు గుర్తించకపోతే ఎలా? ఇంట్లో, యీ సంగతి తెలిస్తే ఎంత బాధ పడతారు?'

'అబ్బబ్బ! చాల్లేరా, నీ బోధలూ నువ్వూను. చదువూ! చదువూ! జీవితంలో యింకేం పరమార్థం లేదా?' విసుక్కుంటూ, అన్నా, మరుక్షణంలోనే రాజా నొచ్చుకుంటాడేమో అన్న అనుమానం కల్గింది రామకృష్ణకి. అనునయంగా భుజం మీద చేతులు వేస్తూ 'ఒరేయ్ రాజా! నీలాంటి మిత్రుడున్నంత కాలం నాకేం బెంగలేదురా! నువ్వు బాగా చదువుకొని పైకివస్తే, 'వాడు నా ప్రాణమిత్రుడు' అని అందరితో చెప్పి గర్వపడతాను' నా సంగతంటావా? బాధపడకు. నాకేమన్నా కష్టం వస్తే, నీ దగ్గరికి వచ్చేస్తాను. సరా! ఒరే! యీ రామకృష్ణ గుండెల్లో రాజాకున్న స్థానం, యింకెవరికీ లేదురా!' భావోద్వేగంలో కంఠం కొంచెం వణికింది. రాజా మనసు ఆర్ద్రమయింది. 'నాకు తెలుసురా! అందుకే, నువ్వు నా ప్రాణంలో ప్రాణం.' మనస్సులోనే అనుకున్నాడు. పైకిమాత్రం గట్టిగా నవ్వేశాడు.

'కాయ్‌రా! కాయ్! యిప్పటికి ఎంతమంది విశాలాక్షులు, వనజాక్షులు ఆ గుండెల్లో ప్రవేశం చేశారో! నాకట్టా నువ్వు చెప్పేది.' విశాలతో తన పరిచయాన్ని, వనజతో తన ప్రేమాయణాన్ని దృష్టిలో పెట్టుకొని రాజా ఏడిపిస్తున్నాడని గ్రహించి రామకృష్ణ కూడా నవ్వేశాడు.

'అవునూ! మంజులా, నువ్వు ఒకే హాల్లోనేకదూ, కూర్చొనేది. తను పరీక్ష బాగా వ్రాసిందా?' రాజా నడక ఆపి రామకృష్ణ మొహంలోకి కుతూహలంగా చూస్తూ అడిగాడు. రామకృష్ణ ఒక్కసారి ఎగిరి పడినంతపని చేశాడు. 'ఒరే రాజా! నేనసలు పరిగెత్తుకుంటూ వచ్చింది, ఒక న్యూస్ చెప్పాలనే. నీ తిట్లుపడేప్పటికి మర్చిపోయాను. నేను ఒక గంటన్నా మొక్కుబడిగా కూర్చున్నాను, గోళ్ళుగిల్లుకుంటూ. మంజుల ఒక అరగంటంటే అరగంటే కూర్చొని, బయటికి వెళ్ళిపోయిందిరా. నన్ను తిడతావుగాని కెమిస్ట్రీ పేపర్ ఎంత టఫ్‌గా ఉందో తెలుసా.' సమర్థించుకుంటున్నట్లన్నాడు. రాజాకి నవ్వు వచ్చింది. 'నువ్వు చెప్పదలచుకొన్న న్యూస్ యిదేనా?' 'కాదు. పూర్తిగా వినవేం? నేను, శివరాం, ఒకేసారి బయటికి వచ్చేశాం. వాడితో కాసేపు మాట్లాడి, కాంటీన్‌లో కాఫీ తాగుదామని వెళ్ళాను. కాఫీతాగి, ఇక నువ్వు వచ్చేసుంటావు, నీదగ్గరకి వద్దామనుకుంటున్నాను



'కెమిస్ట్రీ లాబ్ దగ్గర మంజుల, సెకండియర్ శాంతిలేదూ' ఆ పిల్లతో మాట్లాడుతోంది. పరీక్ష సరిగ్గా రాయలేదా, అని అడుగుదామనుకొని, అటువెళ్ళాను. వాళ్ళిద్దరూ నేను రావడం చూడలేదనుకో. రాజా! మంజుల శాంతితో 'ఏమంటుందో తెలుసా?! నువ్వొట్టి మోసగాడివట! అమాయకురాలైన ఆడపిల్లల్ని వలలో వేసుకొని, ఆడిస్తావట! తేనెపూసిన కత్తివట! నీ అందంతో, మాటల్తో తనని లోబరచుకొని, పెళ్ళిచేసుకుంటానని నమ్మించి, యిపుడు దాటుకుంటున్నావట. అబ్బబ్బ! ఇంకెన్నిమాటలందో? పైగా బుద్ధిలేకుండా ఏడుస్తోంది శాంతిముందు. నాకు ఒళ్ళుమండి, నిజం దాస్తావెందుకని అడిగేద్దామనుకుంటున్నాను. ఇంతలో ఇద్దరూ నన్ను చూసి, పురుగునిచూసి దులపరించుకొని పోయినట్లు, అక్కణ్ణుంచి తప్పుకొన్నారు' కసిగా, బాధగా అన్నాడు.

రాజా వెంటనే ఏం మాట్లాడలేకపోయాడు. 'మంజుల ఎందుకింత అన్యాయమైన ప్రచారం చేస్తోంది? యితరుల సానుభూతికోసం, తనని కించపరుస్తోందా? మంజుల బాహ్యసౌందర్యానికి మురిసిపోయాడు కాని ఈ రోజున, మంజులకి కనీసపు సంస్కారం కూడా లేదని తెలిసింది' వ్యధతో, రాజా మనసు అల్లకల్లోలమయింది. రాజా ముఖంలో ప్రతిబింబించిన భావాలను గమనించి, రామకృష్ణ మనసు చివుక్కుమంది. ఆక్షణంలో మంజుల కన్పిస్తే, లాక్కొచ్చి, క్షమాపణ చెప్పించాలన్నంత పిచ్చికోపం వచ్చింది. 'ఇప్పుడా శాంతి మంజుల చెప్పిందంతా నిజమే ననుకుంటుంది. ఇహ, ఆ పిల్ల, అందరితో అదే చెప్తుంది కాబోలు.' దిగులుగా అన్నాడు రామకృష్ణ. రామకృష్ణ ప్రేమకి రాజా విచలితుడయ్యాడు. 'డోంట్ వర్రీ! లెటజ్ ఫర్‌గెట్ ది పాస్ట్' రామకృష్ణ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడు.

* * *

ట్రెయిన్ కుదుపుకి, ఈ లోకంలోకి వచ్చాడు రాజా. ఏదో స్టేషన్లో ఆగింది ట్రెయిను. 'ఇక జీవితంలో ఎప్పుడూ కలుసుకోకూడదనుకున్న మంజుల కన్పడి, గతాన్ని గుర్తుచేసింది. రామకృష్ణ యిప్పుడెక్కడున్నాడో? ఎమ్. ఏ. ఫస్ట్‌యియర్ చదువుతుండగా కలుసుకొన్నాడు. అంతే, మళ్ళీ తర్వాత మూడు సంవత్సరాల్లో ఒకసారి కన్పడలేదు. అంత మంచిమిత్రులు, ఉత్తరాలు వ్రాసుకోరంటే, ఎవరికైనా ఆశ్చర్యంగానే వుంటుంది. కాలేజి జీవితం, ఒక కరిగిపోయిన కల. ఇపుడా రోజులు కావాలనుకున్నా పొందలేనివి?' ఆలోచనలు సుమిత్ర వైపుకి మరలాయి. 'తను ఎమ్. ఎ. ఫస్ట్‌యియర్ సెలవులకి యింటికి వచ్చినప్పుడు సారధన్నయ్య పెళ్ళి సుమిత్ర వదినతో జరిగింది. తన సీనియర్ సుమిత్రంటే అప్పట్లో తనకెంతో గౌరవం ఉండేది ఎందుకో. గంభీరంగా, హుందాగా, రిజర్వుడుగా ఉండే సుమిత్రను చూసినపుడల్లా, సారధన్నయ్యకి అలాంటి అమ్మాయి దొరికితే బాగుణ్ణనుకునేవాడు. అదే జరిగింది చివరికి. అన్నయ్య పెళ్ళయిపోయిన తర్వాత, వదిన చుట్టూ అస్తమానం, అల్లరిచేస్తూ, చిలిపి పనులుచేస్తూ, మొత్తమొత్తటి చీవాట్లు తింటుండేవాడు. 'ఒరేయ్ రాజా! చిన్నపిల్లవాడిలా ఏమిట్రా అల్లరి' అని అమ్మ కోప్పడితే, సుమిత్ర అపేక్షగా చూస్తూ అనేది. 'ఫర్వాలేదత్తయ్యా! ఈ యింట్లో రాజాకన్న చిన్నవాళ్ళెవరున్నారు? రాజా నాకు తమ్ముడులేని లోటును తీరుస్తున్నాడు.' వదిన అలా అంటే, తనకెంత తృప్తిగా, హాయిగా, గర్వంగా ఉండేది! నిద్రలేవగానే ముందు అమ్మని, వదినని చూడాలనుకునేవాడు. ఆ సమయంలో అమ్మ పూజామందిరంలో ఉండేది. అందుకని గట్టిగా కళ్ళుమూసుకొని 'వదినా!' అని అరిచేవాడు. ఏం కొంప మునిగిందో అని, సుమిత్ర మొదట్లో చేస్తున్నపని వదిలేసి ఆదరా బాదరా వచ్చేది. 'ఎదురుగా నిల్చున్నారా?' అని అడిగి అప్పుడు కళ్ళుతెరచి వదిన మొహంలోకి చూసి తృప్తిగా 'వదినగారూ! గుడ్ మార్నింగ్' అని నవ్వేసేవాడు. అసలు సంగతి, అప్పుడర్థమై నవ్వుకుంటూ వెళ్ళిపోయేది సుమిత్ర. తర్వాత మరిది కోర్కె ప్రకారం తనే రోజూ, అక్కడ రాజా ఉన్నన్నాళ్ళూ, నిద్ర లేపేది. 'వదిన గారూ!' అని అనడం, రాజాకి కష్టంగానూ, సుమిత్రకి వినడానికి అయిష్టంగానూ అన్పించి, యిద్దరూ ఒకరోజు ఓ అగ్రిమెంటుకి వచ్చేసారు; అప్పటినుండీ రాజా 'వదినా, నువ్వు' అనే పిల్చేవాడు.

'వదినా! తల దువ్వవా?'

'వదినా! అన్నం పెట్టు.'

'అబ్బబ్బ! నా పుస్తకం కన్పట్టంలేదు వదినా?'

పిలిచినవాడు పిలిచినట్లే ఉండి, తెగ వేధించేవాడు, అమ్మ మందలింపుల్ని కూడా పెడచెవినబెట్టి. సుమిత్ర ఎంతో ఓర్పుగా, ఓర్పుని మించిన ప్రేమతో అన్నీ అమర్చి, రాజా కిష్టమైనట్లు చేసేది. సారధి పరిహాసంగా అనేవాడు. 'దేవిగారి ముద్దుల మరది పనుల్తో, ఊపిరికే తీరిక లేకుండా పోతుంది.' అని.

ఈ తలపులు రాజాకి ఆహ్లాదంగా కన్పించాయి. 'వదిన దగ్గరకు వెళ్తున్నాడుగా! బాగా కవ్వించి వాదనలు పెట్టుకో వచ్చు.' టైమ్ చూసుకున్నాడు. 'అబ్బ! యింక హైద్రాబాద్ ఎప్పుడు చేరేది?' కొంచెం చిరాగ్గా పైకే అనేసాడు. ఎదురుగా కూర్చున్న ముసలాయన రాజా అజ్ఞానానికి జాలిపడుతూ 'అప్పుడేనా బాబూ! ఏదీ యింకా తెల్లారందే!' రాజాకి తెలీదనుకొని సమాధానమిచ్చాడు. రాజా నోరెత్తలేదు.

* * *

'వదినా! వదినా!'

సుడిగాలిలా లోపలికి దూసుకుంటూ వచ్చాడు రాజా! వరండాలో వున్న జాజిమొగ్గల్ని దీక్షగా మాల కడుతున్న సంధ్య అదిరిపడి తలెత్తింది. కిటికీలోనుంచి ప్రసరిస్తున్న సంధ్యా కాంతి, సంధ్య చెక్కిళ్ళమీద వింత కాంతితో మెరుస్తోంది. సంధ్య నుదురు మీద అల్లిబిల్లిగ ఆడే ముంగురులను చూస్తూ 'ఎవతీ సంధ్యా సుందరి?' నిశ్చలంగా అనుకున్నాడు.

(ఇంకావుంది)

పెద్దకథ

# వదినగారిచెల్లెలు

కిరణ్మయి



[గతసంచిక తరువాయి]

రాజా పిలుపు వినబడగానే జడ అల్లుకుంటున్న సుమిత్ర సంభ్రమంగా వచ్చింది.

'వదినా! బొంబాయినుండి రెక్కలు కట్టుకొని మీ దగ్గరకు వచ్చేసాను. ఇహ మీరు పొమ్మన్నా, ఆరునెల్లవరకూ పోను. ఈ ఆరునెల్లు నా భారమంతా మీదే!' ముందుగానే అప్పగింతలు పెడుతూ వదిన గారు తనకు చెయ్యాల్సిన పరిచర్యల్ని ముచ్చటగా గుర్తు చేశాడు. మరది భావాన్ని గ్రహించి, సుమిత్ర నవ్వేసింది.

'వయసు పెరుగుతున్నకొద్దీ, నీలో చిలిపితనం ఎక్కువవుతోంది రాజా! ముందు లోపలికి పద. కాఫీతాగి స్నానం చేద్దువుగాని' సుమిత్ర వంటగదిలోకి దారితీసింది. రెండు సూట్‌కేసులు, గోడప్రక్కగా పెట్టాడు. చెక్కిట చేయిచేర్చి బొమ్మలా కుర్చీకానుకొని నిలబడ్డ సంధ్యవైపోసారి చూశాడు. రాజా చూపుని తప్పించుకుంటూ, మాల చేతిలోకి తీసుకుంది సంధ్య.

'ఈ అమ్మాయెవరు? వదిన పరిచయం చెయ్యడం మర్చిపోయినట్లుంది.' అనుకున్నాడు. రాజా లోపలికి వెళ్లగానే, అటువైపే వీక్షణం చూసి దీర్ఘంగా నిట్టూర్చింది సంధ్య.

'ఇతడేనా సుమిత్రక్క ముద్దులమరది! అతడికళ్లు తనకళ్ళు కలుసుకోగానే తన గుండె ఝల్లుమన్నట్లయింది. ఎందుకు? అతడి నీడకూడా తనమీద పడితే భరించలేదనుకున్న తను, అతడి చూపులకే కరిగిపోతున్నదే!' జవాబు వెతుక్కోవడానికి ఆరాటపడింది సంధ్య మనసు.

'సంధ్యా! కొంచెం కాఫీకప్పులు తెచ్చి పెట్టమ్మా!'

సుమిత్ర పిలుపుకి ఉలిక్కిపడి, తన ఆలోచనల్ని కట్టిపెట్టి, లోపలికి నడిచింది. కాఫీ కప్పులో పోస్తూ అంది సుమిత్ర. 'తను, మా పిన్ని కూతురు సంధ్య, ఇదివరకు, రెండు మూడు సార్లు చెప్పాను. గుర్తుందా?' రాజా గుర్తుందని తలాడించాడు. 'అబ్బ! పెద్ద తనగురించి చెప్పడాని కేముందో? ఏం చెప్పివుంటుంది, యీ మహానుభావుడికి?' సంధ్య మనసులో కుతూహలం కెరటంలా లేచిపడింది. 'తన' అనేప్పటికి ప్రతివాళ్లకీ ఎంత ఆసక్తిగా అనిపిస్తుంది.! ఇద్దరికీ చెరో కప్పు అందిస్తూ, 'మా సంధ్య బి. యుచ్,

సి. ఫస్ట్‌క్లాస్‌తో పాసయింది రాజా! ఎంత చక్కగా కబుర్లు చెప్తుందో, వినేవాళ్ళకి వోపికుండాలేగాని. నీలాగే అల్లరి ఎక్కువ.' సుమిత్ర మాటలకి సంధ్య మొహం సిగ్గుతో ఎర్రబడి, తల మరింత క్రిందకి వాలిపోవడం రాజా గమనించాడు. మొదటి చూపులోనే, సౌజన్యం, ముగ్ధత్వం మూర్తీభవించినట్టున్న సంధ్య రాజా మనసులో ముద్రవేసింది. సంధ్యకేసి ప్రశంసా పూర్వకంగా చూస్తూ అన్నాడు.

'మరి ఫర్‌దర్‌స్టడీస్‌కి వెళ్ళలేదే?'

'చదివింది చాలు బాబు; అసలే కొంచెం బలం తక్కువ. మరీ సున్నితం. ఇంట్లో కూర్చుని రెస్ట్ తీసుకోబట్టి యీమాత్రం ఉంది.' సంధ్యవైపు చూసిన సుమిత్ర నేత్రాలనుండి వాత్సల్యం వర్షించింది. తెల్లటి ఛాయతో, సన్నగా, పొడవుగా, అతి సుకుమారంగా ఉన్న సంధ్యని చూస్తూ 'నిజమే' అనుకున్నాడు రాజా. సుమిత్ర మాటలు రాజా చూపులు, సంధ్యకి యిబ్బందిగా అన్పించాయి.

'వదిన పెళ్ళికి మీరు రాలేదనుకుంటాను.'

మొదటిసారిగా సంధ్య నుద్దేశించి మాటాడాడు. సంధ్య తడబడింది. 'పరీక్షలు జరుగుతున్నాయి, అప్పుడు.' నెమ్మదిగా గొణిగింది. సంధ్యకి, అక్కడ వాతావరణం ఉక్కిరి బిక్కిరిగా అన్పించి, ఎప్పుడెప్పుడు, అక్కణ్ణుంచి పోదామా, అని ఆరాటపడసాగింది. స్టౌమీద అన్నం వారుస్తున్న సుమిత్ర గేటు చప్పుడవడంతో 'బావగారు వచ్చినట్లున్నారు, చూడు సంధ్యా' అంది. సంధ్య ఒక్క ఉదుటున ముందు గదిలోకి వెళ్ళింది. అప్పుడు కాని ప్రాణం కొంచెం తెరిపిన పడినట్లన్పించలేదు. రాజా ఆశ్చర్యంగా, సంధ్య వెళ్ళినవైపు చూశాడు. 'సంధ్య ఎందుకో, అసౌకర్యంగా ఫీలవుతున్నది. కొత్తవాళ్ళ దగ్గర ఆ అమ్మాయికి అలా అన్పిస్తుందేమో! కాని వదిన యింతకుముందు సంధ్యకి క్రొత్త, పాత లేకుండా అందరితో, చాలా సోషల్‌గా ఉంటుందని చెప్పినట్టు గుర్తు. మరి, అలాంటమ్మాయి, తన మాటలకి సరిగ్గా రెస్పాన్స్ కూడా యివ్వలేదే?!' పెద్ద ప్రశ్నార్థకం తేలు కొండిలా రాజా బుర్రలో నిలబడింది.

'రాజా వచ్చాడా?' ఆదుర్దాగా అడుగుతున్న సారధి స్వరం విన్పించడంతో, టవల్ భుజాన వేసుకుంటూ ముందు గదిలోకి వెళ్ళాడు రాజా!

'రాజా!' సంవత్సరం తర్వాత తమ్ముణ్ణి చూసిన ఆనందాతిశయంతో, సారధి ఆలింగనం చేసుకున్నాడు. సారధెప్పుడూ అంత త్వరగా బయటపడడు. తన ఎమోషన్స్‌ని, తన కంట్రోల్‌లోనే వుంచుకొంటాడు. కాని సంవత్సరం తర్వాత చూసేప్పటికి తన ప్రేమను దాచుకోలేకపోయాడు. అన్నయ్య అనురాగ మాధుర్యాన్ని నింపుకొని తనివి చెందిన రాజా మనసు పొంగిపోయింది. 'తనెంత అదృష్టవంతుడు! కంటికి రెప్పలాగా ఎంతో జాగ్రత్తగా, తన మనసు నొప్పించకుండా మెలిగే తల్లితండ్రులు; ఆత్మీయతను, ఆపేక్షను తనపట్ల నింపుకొన్న సీతారాముల్లాంటి వదినా, అన్న, ఇంతకన్నా ఇంకేం కావాలి?' సంధ్య కన్పడింది ఎదురుగా రేడియోని ట్యూన్ చేస్తూ.

'ముందు తొందరగా స్నానం కానివ్వరా రాజా! మీ వదిన వంట చాలారోజుల తర్వాత, రుచి చూద్దువుగాని!' సారధి రాజాని తొందరపెట్టేశాడు.

'అంతదూరం నుండి ప్రయాణం చేసి వచ్చిన రాజాకన్నా, మీకు తొందరగా ఉందే భోజనానికి.' సుమిత్ర వెక్కిరించింది. రాజా వస్తాడు, తొందరగా యింటికి వస్తే స్టేషన్‌కు వెళ్ళచ్చుని చెప్పింది సుమిత్ర. ఆఫీసు పనిలో, రివాజు ప్రకారం ఆలస్యంగా వచ్చాడు. అదీ కోపం సుమిత్రకని సారధికి తెలుస్తూనే వుంది.

'హతోస్మి! మీ ముద్దుల మరిది వచ్చాడని, నన్ను వెలేస్తున్నావల్లే ఉంది. ఇహ, సంధ్యా మనిద్దరి పని ఆఖరు. సీతా[illegible] చాపేగతి...' విరసంగా కుర్చీలో కూలబడ

# ఓం నమః శివాయ

కం॥ పదవి ముఖ్యము ప్రతి జీవికి
పదవి ప్రముఖతకే ప్రధాన పుదమిన్
పదవి నా కొద్దు ప్రభో
పదవి పనికిమాలిన ప్రభావమే ప్రజ్ఞాన॥

కం॥ పరుల తూలనాడన్
పరోపకారిని, ప్రతి ఫలాపేక్షనా
పక్ష పాతిని గాదన్న
పల్కుదు ప్రతిధ్వనింప ప్రతిజ్ఞ పరిపాలింతు నన్న

కం॥ పసిపాపను కాదంటివిన్
పతితి నని ప్రతిఘటించి పరాభింతువేమో
పరిస్థితు లెట్లుండు నన్న
పరిశీలించి, కరుణించి, చిందించుము చిదంబరా॥

కం॥ పరస్పరాను రాగిణి
పరాఙ్ముఖమేల, దాచనేడాలన్యమేల
పరమ ప్రీతి నాతు
పరితాపాగ్నిలో పడవైచి వేధించితివన్॥

రచయిత్రి: శ్రీమతి సరస్వతీగిరి

'శివభక్తురాలు, అనామధేయి' పేర్లతో రాసినవారు రాష్ట్రపతి శ్రీ గిరిగారి సతీమణి శ్రీమతి సరస్వతీ గిరిగారు. ఈ సంగతి పాఠకులకి తెలియచెయ్యవచ్చునని వారే అన్నారు కాబట్టి, ఇకపంబున 'ఓం నమః శివాయ' శీర్షిక కింద ప్రచురణ అయ్యే పద్యాలతోబాటు వారి పేరు కూడా వేస్తాము. —సం॥

# వదినగారి చెల్లెలు

సారధిని చూసి; సుమిత్ర, సంధ్య ఫక్కున నవ్వారు. సుమిత్ర నవ్వడం చూసిన తర్వాత గాని సారధి మనసు కుదుటపడలేదు. 'బతుకు జీవుడా' అనుకుంటూ కుర్చీలోంచి లేచాడు.

'అన్నయ్యా! అమ్మా, నాన్న ఎప్పుడొస్తారంట?' తల దువ్వుకుంటూ అడిగాడు రాజా. 'అప్పుడే ఎక్కడ రాజా! దేశంలో వున్న పుణ్యక్షేత్రాలన్నిటిని దర్శించుకొని తిరిగి వచ్చేప్పటికి రెణ్ణెల్లు పడుతుంది. నాన్న శ్రీశైలం నుంచి మొన్ననే ఉత్తరం వ్రాశారు.' సారధి టవల్‌తో తడిముఖం తుడుచుకుంటూ జవాబిచ్చాడు. రాజా పరధ్యానంగా దువ్విన తలనే దువ్వడం మొదలెట్టాడు. 'అమ్మా వాళ్ళని చూసి, ఎన్నిరోజులయింది! తనకి హైద్రాబాద్ ట్రాన్స్‌ఫరయిందని తెలియకముందే, వాళ్ళు తీర్థయాత్రలకు వెళ్ళిపోయారు. బొంబాయికి, తనను చూడటానికి వెళ్తామని అన్నయ్యతో చెప్పారట. అమ్మ ఎలా ఉందో? తనంటే యెంత ప్రాణం అమ్మకి! 'పిచ్చి నాన్నా! మరి అంత మెత్తగా ఉండకురా! మంచికి రోజులు కావు' అని తన గురించి ఆదుర్దా పడేది. తనను చూడాలని ఎన్ని ఉత్తరాలు వ్రాసింది! తీరా వచ్చేప్పటికి వెళ్ళిపోయారు.' నిరుత్సాహంగా అన్పించింది, ఒక్కక్షణం రాజాకి.

'ఏమయ్యా! ఇంకా అవలేదా? కొత్త పెళ్ళికొడుకులాగా, అద్దముందునుంచి ఇంకా కదలవే!' వంటగది గడపదగ్గరనిల్చొని, రాజా గదిలోకి తొంగిచూస్తూ అంది. రాజా కొంచెం సిగ్గుపడ్డాడు. 'అమ్మని గురించి ఆలోచిస్తున్నా వదినా!' సంజాయిషీ చెప్పుకొంటున్నట్లు అన్నాడు.

నలుగురూ, భోజనం టేబుల్‌ముందు కూర్చున్నారు.

'ఇదిగో విన్నారా! మన రాజా అమ్మమీద బెంగపెట్టుకొన్నాడు.' సుమిత్ర అంది.

'ఇంకా యేమిట్రా చిన్నపిల్లాడిలా. అమ్మ కొంగు మానేసి, రాబోయేవాళ్ళ కొంగు పట్టుకోవడం నేర్చుకో. నేను చూడు, అస్తమానం మీ వదిన కొంగు పట్టుకుని తిరగబట్టే, ఈమాత్రం చూస్తోంది.' సంధ్య నవ్వుని పెదాల వెనుకే దాచుకొంది. సుమిత్ర, అతికష్టంమీద నవ్వాపుకుంటూ, 'ఇహ చాల్లెండి—మీ అబద్ధాలు. రాజా నిజమేనని నమ్మగలడు' అంది. రాజా పెదాలమీద నవ్వు చిందు లేసింది.

'ఇదిగో బాబూ! ఈసారి అత్తయ్యగారు యాత్రలనుండి రాగానే, నీ పెళ్ళిచెయ్యడం ఖాయమని చెప్పారు. ఎవరినన్నా ప్రేమించానంటావేమో! ముందుగా మాతోచెప్తే, మీ నాన్నగారికి రికమెండ్ చేస్తాం. ఇపుడు చెప్పకుండా, ఆ తర్వాత విచారించి లాభం లేదు. అంతే కదండీ!' సారధి సపోర్ట్‌కోసం అడిగింది సుమిత్ర. సారధి ఏం మాట్లాడలేదుకాని, ప్రశ్నార్థకంగా తమ్ముడివంక చూశాడు. రాజా యిబ్బందిగా నవ్వాడు. 'అలాంటిదేం లేదు.' సారధి మనసు కొంచెం శాంతించింది. 'ఐతే తనుకున్నట్లే జరుగుతుంది. రాజాకి తన మాటంటే చాలా గౌరవం' అనుకున్నాడు.

భోజనాలయిపోయాయి. సంధ్య నోరెత్తలేదు కాని, సారధి నవ్వులతో, రాజా జోక్సుతో సుమిత్ర పరిహాసాలతో; వాతావరణం చైతన్యవంతమైంది. పసిపిల్లల అమాయకతను నింపుకొన్న రాజా స్వచ్ఛమైన నవ్వు, నిష్కపటమైన అతడి ముఖకవళికలు, గమనించినకొద్దీ, సంధ్యకి, తను రాజాని గురించి విన్నది అబద్ధమేమో అన్న అనుమానం పీడించసాగింది. చెయ్యి కడుక్కోవటానికి లేస్తూ రాజా అడిగాడు 'వదినా! మంచినీళ్ళు' గిన్నెలు సర్దుతున్న సుమిత్ర సంధ్యకోసం చూసింది. రాజా అంటుండగానే అక్కయ్య తన్నెక్కడ యిమ్మంటుందో అనే భయంకొద్దీ సంధ్య అక్కణ్ణుంచి అప్పుడే జారుకుంది, రాజామాటలు వినపడనట్లు నటిస్తూ. అతడి సామీప్యమే మహాకష్టంగా ఉన్నప్పుడు, అతడికోసం, ఎంత చిన్న పనైనా సరే చేయడానికి సంధ్య మనసు వ్యతిరేకిస్తోంది. కనీసం, అలా అని ఆ క్షణంలో సంధ్య అనుకుంది. 'తనడిగింది సంధ్యకి తప్పకుండా వినపడే వుండాలి. మరి అలా నిర్లక్ష్యంగా, పట్టనట్లు వెళ్ళిపోతుందే!' అర్థంకాక రాజా కనుబొమలు ముడిపడ్డాయి.

'సంధ్య ఏం చేస్తుందీ?' సుమిత్ర చేతిలో తమలపాకు చిలకల్ని, వంగి అందుకుంటూ అడిగాడు సారధి.

'తల నొప్పిగా వుందని పడుకొంది' ఆకులకి సున్నం రాస్తూ సమాధానమిచ్చింది. బద్ధకంగా సోఫాలో వాలిన రాజా మనసులోనే అనుకున్నాడు.

'ఇందాకంతా బాగానే ఉందిగా! ఇంత హఠాత్తుగా ఎలా వచ్చిందో? మేలుకునుంటే ఇక్కడ కూర్చోవలసి వస్తుందని భయమేమో!' పాపం, రాజా తనకి తెలీకుండానే సరిగ్గా ఊహించగల్గాడు. రాజాకి కల్గిన సందేహమే సారధికి కల్గింది.

'ఇంతాకంతా బాగానే ఉందిగా! రోజూ భోజనాలదగ్గర, తెంపు లేకుండా కబుర్లు చెప్పేది ఇవాళసలు పెదవి కదిపినట్లు లేదే' ఆశ్చర్యంగా అన్నాడు. ప్రక్కగదిలో పడుకున్న సంధ్యకీ సంభాషణంతా వినబడుతూనే ఉంది.

'అబ్బబ్బ! ప్రతిదానికీ మీ కనుమానమే ఇందాక రాకపోతే, యిప్పుడు రాకూడదని రూలా?. విసుక్కుంటూ అన్నా, సుమిత్రకి సంధ్య ప్రవర్తనకి కారణం తెలుసు. అంతరాంతరాల్లో సుమిత్రకి, సంధ్య ప్రవర్తన సమంజసంగానే తోచింది.

'అవును, సంధ్య వద్దంటే మంచిది. తర్వాత ఎలాంటి సమస్యలు ఎదురవ్వవు. తను జోక్యం చేసుకోకుండా, సంధ్యని, తన మార్గానికే వదిలేస్తాను.' సుమిత్ర మొదటిసారి గట్టిగా అనుకుంది.

* * *

ఉదయకిరణాలు వెచ్చగా, గిలిగింతలు పెట్టడంలో, రాజా నిద్రమత్తు వదిలింది. బద్ధకంగా లేచి, బ్రష్‌మీద పేస్టు వేసుకుంటూ, కిటికీ కేసి యధాలాపంగా చూశాడు. తోటలో సంధ్య కన్పించింది. నిర్మలంగా ఉన్న సంధ్య ప్రశాంతవదనాన్ని చూడగానే రాజాకి 'ఉషాకన్యలా...మంచులో తడిసిన మెత్తటి విరిజాలలా...' అన్పించింది. ఉదయం లేవగానే సంధ్యా దర్శనం అయినందుకు ఎందుకో ఉల్లాసంగా, తృప్తిగా అన్పించి, ముఖం కడుక్కోటానికి 'వాష్ బేసిన్' దగ్గరకు వెళ్ళాడు.

తోటలో, అన్యమనస్కంగా పచార్లు చేస్తున్న సంధ్య మనసులో, ఎంత వద్దనుకున్నా, రాజా గురించిన ఆలోచన్లు అల్లుకుంటున్నాయి. ఎర్రటి దేహచ్ఛాయలో, పొడవుకు తగ్గ లావుతో, చిన్నవైనా చురుగ్గా చూసే కళ్ళతో, చెరగని చిరునగవుతో, సుస్మితంగా, సౌమ్యంగా మాట్లాడే రాజాని

తలచుకొన్న కొలదీ, సంధ్య హృదయంలో వశి కాలంతో అసహనం తప్పసాగింది.

సభ్యతా, సంస్కారాలు మూర్తీభవించి నట్లున్న అతడిని చూస్తే ఎవరైనా ఆక ర్షించబడతారు. మరి తను విన్నదానికీ స్వయంగా చూస్తున్నదానికి పొలికే లేదే?' మథనపడసాగింది. ఏదో అర్థం కాని అశాంతి అసంతృప్తి తీవ్రంగా కల్గాయి. మరో సారి శాంతి మాటలు, మనసులో మార్మోగాయి.

తిరుపతి కాలేజీలో క్రొత్తగా ఫైనల్‌లో చేరిన శాంతికీ, సంధ్యకీ మంచి స్నేహం ఏర్పడింది.

ఏదో మాటల సందర్భంలో, అంతకు ముందు తను చదివినకాలేజి కబుర్లుచెప్తూ రాజా, మంజుల ప్రేమాయణాన్ని గురించి చెప్పింది.

'ఆ రాజానిచూస్తే అలాంటి వాడని ఎవరూ అనుకోరు సంధ్యా! పాపం, మంజుల ఎంత కృంగిపోయిందో తెలుసా! తన అందంతో వాక్చాతుర్యంతో ఆడపిల్లల్ని, అద్భుతంగా వశపరచుకుంటాడని ఉట్టి కపటి, స్వార్థపరుడని, అతడి ఆకర్షణ మహా ప్రమాదకరమైనదని, నాముందు వాపోయేది. ఐనా, పెళ్ళి చేసుకోకుండా తప్పించుకోవడం నాకూ చాలా అన్యాయంగా అన్పించింది. మంజులకూడా అలా తొందరపడి తిరి గుండాల్సింది కాదనుకో. అమ్మాయికే లేని భయం, అబ్బాయికి మాత్రమెందు కుంటుంది? కాని ఒకటి మాత్రం ఒప్పుకో వాలి సంధ్యా! మంజులకి తను చాలా అందంగా ఉంటానని గర్వం. అదే నాకు నచ్చేది కాదు. సౌందర్యానికి సౌమ్యత తోడయి నపుడే రాణిస్తుంది.' శాంతి పెద్ద లెక్చర్ దంచింది. సంధ్య పెద్ద పెద్ద కళ్ళలో కుతూహలం ప్రతిఫలించింది. 'మరి మంజుల పెళ్ళయిందా? రాజా ఏమయ్యాడు?' 'ఎవర్నో డాక్టర్ని చేసుకుందంట. రాజా సంగతి తెలీదుకాని, రాజాఫ్రెండ్ రౌడీ రామకృష్ణ అని చెప్తారే, అతగాడు మాత్రం, కెమిస్ట్రీలో ఢంకీకొట్టాడు అబ్బ! ఆ రామకృష్ణని చూస్తే నాకెంత భయం వేసేదనుకున్నావ్. పాపం, నన్నెప్పుడూ ఏమీ అన్లేదనుకో' శాంతిమాటలు, సంధ్య మన సులో, రాజా రామకృష్ణల్ని ఆడపిల అపారిటి రాక్షసులుగా చిత్రించాయి. అదే భావన యిప్పటిదాకా చెరగలేదు.

తీరా, రాజా సుమిత్రక్క మరది అని తెలిసినపుడు చాలా ఆశ్చర్యం కల్గింది. ఒక సారి అతడిని చూడాలనే కుతూహలం, తీవ్రమైనకోర్కె కలిగాయి. సుమిత్రక్క, తమక్కడ వచ్చినప్పుడల్లా రాజాగురించి చాలా కబుర్లు చెప్పేది. ఎంతో ఆసక్తిగా వినేది సంధ్య. కాని తను చిత్రించుకొన్న రాజాకి, సుమిత్ర మాటల్లో ప్రత్యక్షమయ్యే రాజాకి, హస్తిమశకాంతరం కన్పించి తికమక పడేది. రెండిటికీ సమన్వయం కుదిరేది కాదు. కెమిస్ట్రీ ప్రాబ్లమ్స్ చిటి కెలో సాల్వ్‌చేసే సంధ్యకి, ఈరాజా స్వభావం మాత్రం, మిస్టరీగానే మిగిలిపోయింది. ఇపుడు రాజాని చూసినతర్వాత ఇంకా చిక్కు పడింది. సుమిత్రక్క, ఇదివరలో ఒక్కసారి, రాజా, మంజుల కలిసి తిరిగేవారని, ఆ విష యం మాత్రం, తనకు నచ్చేదికాదని మాత్రం అంది. మళ్ళీ ఎప్పుడూ, ఆసంగతి ఎత్తలేదు.

*　　*　　*

సారథి, రాజా ఆఫీసుకి వెళ్ళారు. మధ్యా హ్నం భోజనాలు ముగించి తిరిగ్గా సుమిత్ర దిండు గలేబుమీద ఎంబ్రాయిడరీ చేస్తోంది. సంధ్యకేం తోచలేదు. నెమ్మదిగా సుమిత్ర దగ్గరకుచేరి, తన కాలేజి కబుర్లు చెప్పమని వేధించింది. అసలుబాధ రాజాగురించి ఏమన్నా క్రొత్తవిషయాలు తెలుస్తాయని. సుమిత్ర కబుర్లుచెప్తూ, మధ్యలో రాజావిషయంవచ్చి యధాలాపంగా అన్నట్లుంది. 'రాజా సౌంద ర్యాన్ని ఆరాధిస్తాడు. ఎటొచ్చీ, ఆ ఆరాధన, అందమైన ఆడపిల్లలపట్ల అభిమానంగా రూపొందడందగ్గరే వస్తుంది చిక్కు. అతడి స్వభావం పాదరసంలాంటిది. దేన్నీ స్థిరంగా అంటిపెట్టుకోలేడు. చైతన్య స్రవంతిలా గలగలసారే, అతడి ఆకర్షణా వాహినికి ఎదురు నిలబడ దలచుకున్నవారు, అందులో కొట్టుకు పోవాల్సిందేకాని, నిరో ధించలేరు. తమాషా ఏంటంటే, అతడ్ని మాత్రం, ఎవరిఆకర్షణా ఎక్కువకాలం బంధించలేదు.' బహుశా, సుమిత్రక్కయ్య మంజుల విషయం మనసులో పెట్టుకొనే అలా అనివుంటుందని సంధ్య గ్రహించింది. 'తామరాకుమీద నీటిబొట్టు మనస్తత్వమా?' విందుకో. ఆ జవాబు తనకే తృప్తి కల్గించలేదు.

'రాజా యిలాంటివాడా!' సంధ్య అంత రాంతరాల్లో ఎక్కడో గుచ్చుకున్నట్లన్పిం చింది. రాజా సామీప్యంలో అర్ద్రమై, మంచులా కరుగుతున్న మనసు, శాంతి మాటల పునఃస్మరణలో, సుమిత్ర అభి ప్రాయంతో ఘనీభవించి కఠినంగా మారింది. 'దీపంచుట్టూ తిరిగే పురుగుల్లా, తన చుట్టూ ఆడపిల్లలు తిరుగుతారని భ్రమ పడుతున్నాడేమో! తనలాంటిది కాదని నిరూపించి, అతడి అహంకారాన్ని దెబ్బ తియ్యాలి!' దృఢంగా అనుకొంది.

పాపం, సంధ్య! తనమనసు నావరించు కొన్న పిరికిదల్ని ఛేదించే ప్రయత్నంలో, తన మనసుని తన అధీనంలో వుంచుకోవా లనే తాపత్రయంలో, రాజాని ద్వేషిస్తు న్నట్లు పొరబడింది. నిజం కాకూడదని మనసు బలంగా కోరుకున్నప్పుడు, అదే తప్పు నిజంగా ఋజువయ్యేప్పటికి ఆ అఘాతాన్ని తట్టుకోలేక మనుష్యులందరూ, అలానే ప్రవ ర్తిస్తారేమో!

*　　*　　*

'హల్లో రాజా!' ఎవరో అమాంతంగా పేవ్‌మెంట్‌మీద తన్ని కౌగిలించుకున్నంత పని చేసేసరికీ, రాజా ఉక్కిరిబిక్కిరయ్యాడు. రామకృష్ణ ఎదురుగా నిల్చొని నవ్వు తున్నాడు. రాజాకి ఆశ్చర్యంతో, ఆనందాతి శయంలో నోటమ్మంచి చప్పున మాట ఊడి పడలేదు.'

'ఏరా, ఆఫీసరు వయ్యేప్పటికి, యీ గుమస్తాగాడు, నీకంటికి కానరాల్దేదా!' దబాయించాడు, కోపం నటిస్తూ.

'రామకృష్ణా!' చప్పున భుజంమీద చేతులేస్తూ, రాజా ఎదురుగా ఉన్న 'లాజ్' లోకి లాక్కుపోయాడు, రామకృష్ణకి, యింకోమాట మాట్లాడే అవకాశ మివ్వ కుండా.

'ఊ! ఇప్పుడు చెప్పు. ఇన్నాళ్ళా ఏం చేస్తున్నావు? ఇప్పుడెక్కడ ఉద్యోగం.' పెసరట్టు తింటూ అడిగాడు రాజా.

'కెమిస్ట్రీ పరీక్షలో మూడుసార్లు డింకీ కొట్టాను. కాలేజీకి గుడ్‌బై కొట్టాను. ఇప్పుడు ఆంధ్రాబాంక్‌లో క్లర్కుగా ఉద్యోగం చేస్తున్నాను.' సీరియస్‌గా, ఆఫీసర్ ఉద్యోగం చేస్తున్నంత ఠీవిగానూ అంటూ, 'ఇప్పు

దిద్దారు సిస్టర్లు. భార్యా రత్నం యస్. యస్. ఎల్. సి. తప్పింది.' హేళగా రాజాని చూస్తూ అన్నాడు. చివరిమాటలకి మొదట రాజా తృళ్లిపడి రామకృష్ణకేసి చూశాడు. మహాగంభీరంగా ఉంది. గట్టిగా నవ్వేసి, భుజంమీద చరుస్తూ, 'రాస్కెల్! నాకు తెలీకుండా పెళ్లి చేసుకుంటే వట్టుకు తన్నను.' అన్నాడు. రామకృష్ణ కూడా నవ్వేశాడు.

ఇద్దరూ బస్‌స్టాప్ వైపు నడుస్తున్నారు. 'పెళ్లి, గిళ్లి ఏంలేదా?' రాజా నవ్వుతూ అడిగాడు. 'ముందు ప్రేమా, గీమా పూర్తి చెయ్యనియ్యి.' సిగరెట్ వెలిగిస్తూ జవాబిచ్చాడు. 'ఏమిటి కథ' రాజా కళ్లెగరే శాడు. రామకృష్ణ స్వరం గంభీరంగా, ఆదరకమైన మార్దవాన్ని నింపుకుంటూ పలికింది. 'తెగిన గాలిపటంలా ఎటు పడితే అటు తిరిగే, నన్ను ఒక క్రమపద్ధతిలో, మనిషిగా తీర్చింది పరిమళ. తను మా ఆఫీస్‌లో, నా కొలీగ్. ప్రేమకి పవిత్రమైన నిర్వచనాన్ని యిచ్చిందిరా తను.' పరిమళ నామస్మరణతో రామకృష్ణ ముఖం ప్రకాశ వంతమయింది. రాజా విస్మయంగా చూశాడు 'ఎంత మారిపోయాడు రామకృష్ణ! ఇది వరకులా వివాహం తన స్వేచ్ఛకాటంకమవు తుందనే బాధ మచ్చుకైనా కన్పించడం లేదు. పైపెచ్చు, కొన్ని నియమాలకు, కట్టుబాట్లకు మనస్ఫూర్తిగా కట్టుబడ్డ ఆత్మ తృప్తి ముఖంలో ప్రతిబింబిస్తున్నది.' పైకిమాత్రం అన్నాడు 'ఒరేయ్! నువ్వు నిజంగా అలా ఫీలవుతున్నావా?'

'ఏమోరా! ఈసారి అనుభూతి క్రొత్తగా, హృదయం ఆదరకంగా స్పందిస్తున్నట్లనిపి స్తోంది.' అమాయకంగా ముఖం పెట్టి సగం చిలిపిగా అన్నా, నిజాయితీ ధ్వనిం చింది. ఇద్దరూ, ఒకరిముఖాలొకరు చూసు కొని-ఫక్కున నవ్వేశారు. ఎదురుగా నస్తున్న వయ్యారి చిడిముడి పాటులో, తీక్షణ వీక్ష ణాలతో 'ఆడపిల్ల కన్పడితే చాలు, బుద్ధి వక్రిస్తుందెందుకో?' గట్టిగానే అనేసి రయ్ మంటూ దూసుకుపోయింది. ఇద్దరికీ, ఒక నిమిషం తర్వాత కాని అర్థం కాలేదు. 'ఈ అమ్మాయెవరో మంజులకు నకలు లాగా ఉందిరా, రాజా! ఏం ఆడపిల్లరా భగవంతుడా, రోడ్డుమీద కళ్లెత్తి చూడ టానికి, హాయిగా నవ్వుకోటానిక్కూడా స్వతంత్రం లేదా!' రామకృష్ణ వాపోయాడు.

* * *

'వదినా వాళ్లు లేరా?'

నవలలో లీనమైపోయిన సంధ్య తలెత్తి చూసింది. ఎదురుగా రాజా ప్రక్కన ఎవరో క్రొత్త వ్యక్తి, చప్పున పుస్తకం మూసి లేచి నిలబడుతూ జవాబిచ్చింది. 'లక్ష్మణ రావుగారింట్లో డిన్నర్‌కి వెళ్లారు.' రాజా కేంచెయ్యాలో తోచలేదు. సంధ్యతో తనె ప్పుడూ మాట్లాడలేదు, యింతవరకూ పరి చయం చేస్తే ఏమనుకుంటుందో? చెయ్యక పోతే అసభ్యతన్పించుకుంటుంది. 'నా ఫ్రెండ్ రామకృష్ణ ఆంధ్రాబాంక్‌లో వర్క్ చేస్తు న్నాడు.' కొంచెం భయంగానే పరిచయం చేశాడు. సంధ్య ముఖంలోని ప్రశాంతతను చూసాక, కొంచెం కుదుటపడి, 'తను, మా వదినగారి చెల్లెలు అదే...కజిన్...బి. యస్. సి. ఫస్ట్‌క్లాస్. పేరు సంధ్య.' రామకృష్ణ కేసి తిరిగి అన్నాడు. రామకృష్ణ! పేరు ఎక్కడో విన్నట్టుంది. మనసులో ఏదో జ్ఞాపకం, గజిబిజిగా మెదిలింది. చటుక్కున గుర్తొచ్చింది. మనిషిని చూడబోతే, మాంచి అందంగా, గంభీరంగా వున్నాడు. 'విగ్రహ పుష్టి, నైవేద్యనష్టి' మనసులోనే గొణు క్కుంది. ముగ్గురూ బొమ్మల్లా కూర్చు న్నారు కాసేపు. కులాసాగా, హాయిగా ఉన్న రాజాని చూస్తుంటే సంధ్యకి, రాజా మనసు నొప్పించి చూసి ఆనందించాలనే కోర్కె కల్గింది మనసులో ఏ మూలో. రామ కృష్ణతో తను చనువుగా మెలిగితే, రాజా ఎలా రియాక్టవుతాడో చూడాలన్న కుతూ హలం లేకపోలేదు.

కాఫీ, టిఫిన్ అమరుస్తూ అంది సంధ్య 'మీరు పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌కి వెళ్లలేదా?' ఏడిపించ బుద్ధేసింది సంధ్యకి. రామకృష్ణ గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది.


'కె...కెమిస్ట్రీ పోయింది.' నెమ్మదిగా గొణిగాడు.

'అయ్యో! నాకు తెలీకడిగాను' నొచ్చు కుంటున్నట్లంది.

'మీకు నవలలు చదవడం యిష్టమేనా?' మరో పిడుగు పడింది.

పుస్తకాన్ని చూస్తూనే తలనొప్పి తెచ్చు కునే రామకృష్ణ రాజాకేసి దిగులుగా చూశాడు. 'ఏం చెప్పను' అన్నట్టు. రాజాకి సంధ్యవాలకం ఆశ్చర్యంగా ఉంది. అసలు 'రాజా' అనే శాల్తీ అక్కడున్న సంగతే గుర్తులేనట్టు ప్రవర్తిస్తోంది. ఇద్దర్నీ చూస్తూ నవ్వుకొంది సంధ్య. వాతావరణా నికి యిహ మార్పు అవసరమని అప్పుడు నిర్ణయించుకొంది.

'అబ్బ! ఎవరు చూసినా క్రికెట్ గేమ్ గురించే మాట్లాడుతుంటారు. నాకైతే, ఎలా ఆడతారో కూడా సరిగ్గా తెలీదు. మీకు తెలుసనుకుంటాను. చెప్తారా?' అమాయకత ఉట్టిపడేట్టు అడిగింది. తన



ఫేవరెట్ ఫీల్డు రావడంతో రామకృష్ణ ఉత్సాహం పుంజుకొని వివరించడం మొదలు పెట్టాడు. అంతే, కబుర్లు, ఏకధాటిగా యుద్ధరిమధ్యా దొర్లిపోయాయి; పటౌడీ దగ్గరనుంచి దేవానంద్‌దాకా—రాజా వలనం లేనివాడిలా . కూర్చుండిపోయాడు. రామ కృష్ణకి గంటలు నిమిషాల్లా పరిగెత్తితే, రాజాకి నిమిషాలు, యుగాల్లాగా అన్పించాయి. సంధ్యకి...? రామకృష్ణ, కెమిస్ట్రీ లెక్చరర్ లీలలు ఏక్షన్‌తోసహా వర్ణిస్తూ, 'ఇంతలో మా కాలేజి బ్యూటీ మంజుల లేచి నిల్చుని...' అంటూ గతుక్కుమన్నవాడిలా నాలిక్కొరుక్కొన్నాడు. సంధ్య చటుక్కున రాజావైపు చూసింది.

రాజా బలవంతంగా పెదాలమీద నవ్వు తెచ్చుకున్నాడు. ఒక్కక్షణం, మంజుల ప్రసక్తితో, ఆ చిరునవ్వుచాటున మాలిన్యపు ఛాయలు, రాజా వదనంలో తారాడటం, సంధ్య గమనించకపోలేదు. మనస్సు చివుక్కుమన్పించి, ఆ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో తెలీక చింతించసాగింది. ఇంతలో, సారథి, సుమిత్ర, లోపలికి రావడంతో ముగ్గురూ రక్షింపబడ్డారు. రామకృష్ణ బ్రతికిపోయాననుకున్నాడు.

ఆ రాత్రి సంధ్యకి సరిగ్గా నిద్రపట్టలేదు. వెలవెలపోతున్న రాజా మొహం, పదే పదే కళ్ళల్లో మెదిలి వ్యథ చెందింది. అతడి తలపుల్లో మనసు ఆర్ద్రమయింది. కానీ, ఓ పక్క మంజుల, మనసులో ముల్లులా మెదులుతూ, మెత్తపడుతున్న మనసుని గదమాయిస్తోంది.

* * *

'సుమీ! ఇత్రముద్‌లో మంచి స్పెషల్ పిక్చర్ ఆడుతుందంట. బెనర్జీ ఫోన్‌చేసి చెప్పాడు. వాడి మిసెస్ కూడా వస్తున్నారంట. చప్పున తయారవ్వాలి. టైమ్ ఎక్కువలేదు.' లోపలికి వస్తూనే హడావుడి పెట్టేశాడు సారథి. 'రాజా యింకా రాలేదా?' కోటు సుమిత్ర చేతికందిస్తూ ప్రశ్నార్థకంగా చూశాడు. 'ఇందాకే వచ్చాడు. తను, రామకృష్ణ పిక్చర్ ప్రోగ్రాం వేసుకున్నారు. వచ్చేప్పటికి చాలా ఆలస్యమవుతుందేమో. ఎదురు చూడద్దని చెప్పి వెళ్ళాడు.' కోటు హేంగర్‌కి తగిలిస్తూ అంది. 'అదా! సంధ్య ఏది? ఏ మరదలు పిల్లా! ఎక్కడున్నావ్? అద్దం ముందు [illegible] మనం అందుకునేది సెకండ్ షోకే. తొందరగా తయారయితే రక్షించిన దానివవుతావ్.' గట్టిగా అన్నాడు సారథి. తన గదిలో, రాధాకృష్ణుల చిత్రాన్ని ఇండియన్ ఇంక్‌తో దిద్దుతున్న సంధ్య విసురుగా వచ్చి ఉక్రోషంగా అంది.

'ఇదిగోండి బావగారు! మీరుచేసే పన్లు చేస్తూ, నన్నంటే ఊరుకోను. బయటికి వెళ్తున్నప్పుడల్లా 'సుమీ! షర్ట్‌కి కొంచెం మరకయినట్లుందే! అబ్బ! యీ క్రాఫ్ సరిగ్గా కుదరటల్లేదు, కొంచెం దువ్వి పెడుదూ! ముఖంమీద పౌడర్ కన్పిస్తుందా. సరిగ్గా చూడు.' అని అక్కయ్య ప్రాణం తీసి, అనుకున్నదానికి అరగంట ఆలస్యం చేస్తారు. పైగా నన్నంటారే!' గుక్క తిప్పుకోకుండా అనేసింది.

'అమ్మా! తల్లీ! సంధ్యాదేవీ! శాంతించు. ఇంతకీ తమరు దయచేస్తున్నట్లేనా?' చేతులు జోడించాడు. సంధ్య కొంచెం తగ్గింది.

'ఉహూ! నాకివాళ రావాలని లేదు. బొమ్మ పూర్తి చేయాలి.' నసుగుతూ అంది. చీర కట్టుకొని అప్పుడే అక్కడికి వచ్చిన సుమిత్రకి కోపం వచ్చింది.

'ఇంట్లో ఒక్కదానివి ఎలా వుంటావ్? సర్లే, నేనూ మానేస్తాను.' సంధ్య చప్పున సుమిత్ర దగ్గరకు వచ్చి, మెడ చుట్టూ చేతులు వేసి, ముద్దుగా అంది. 'ప్రక్కన రాణీవాళ్ళున్నారుగా! భయమన్పిస్తే తోడు తెచ్చుకుంటాలే. అసలు బావగారికి సెలవు దొరకడమే తక్కువ. అలాంటిది, ఎప్పుడో ఒకసారి తీసికెళ్ళేదానికి మానేస్తాననటా వేమిటి? నాకు బయటికి యివాళ వెళ్ళాలని లేదక్కా. ప్లీజ్' బ్రతిమాలుతున్నట్లంది. సుమిత్ర మెత్తబడింది.

ఇద్దరూ వెళ్ళిపోయిన తర్వాత సంధ్య కాస్సేపు తోటలో తిరిగింది. ఇంట్లో ఉన్నది తను ఒక్కతే అన్న భావన రాగానే ఏవేవో, ఊహలు అల్లరి చేశాయి సంధ్యలో. మనసులోని మమతల మల్లెలవి, మాలుగా కట్టి, ఈ ఏకాంతంలో ఎంతటి మాధుర్యం ఉంది!

భోజనం పూర్తిచేసి, పడక కుర్చీలో [illegible] పదిమిది దాటింది. 'అక్కయ్యా వాళ్ళు వచ్చేటప్పటికి ఇంకో రెండు గంటలు పడుతుంది. రాజా ఎప్పుడొస్తాడో?' కళ్ళు మూసుకొంది. ఊహల్లో స్వేచ్ఛగా విహరిస్తున్న సంధ్య మనసు, తలుపు చప్పుడవడంతో వాస్తవంలోకి దిగింది. పరధ్యానంగా తలవంచుకొని లోపలికి వస్తున్న రాజాని అలాగే కళ్ళప్పచెప్పి చూడసాగింది.

'రామకృష్ణ రూమ్‌కి తాళంవేసుంది. ఎదురుగా ఉన్న కిళ్ళీకొట్టతను, తను రూమ్ దగ్గర నిలబడ్డం చూసి పిలిచి చెప్పాడు. ఎవరో అమ్మాయివస్తే యిద్దరూ కలిసి వెళ్ళారంట. బహుశా పరిమళ వచ్చి వుంటుంది.' ఆలోచన్లలో మునిగిపోయిన రాజా మొదట సంధ్యని గమనించలేదు. కుర్చీలో అలసటగా వాలబోతున్నవాడల్లా సంధ్యని చూసి ఉలిక్కిపడ్డాడు. ఏ వ్యక్తి ఊహల్లో మునిగి, పరిసరాల్ని విస్మరించిందో, ఆ వ్యక్తే అనుకోకుండా ఎదురుగా ప్రత్యక్షమయ్యేప్పటికి, సంధ్య, పట్టుబడిన దొంగలా అనుభూతి చెందింది. ముఖంలోని భావాల్ని దాచుకోవడానికన్నట్లు, చటుక్కున లేచి, కిటికీదగ్గర నిల్చొని బయటికి దీక్షగా చూడసాగింది. రాజా మొహంలో కన్పిస్తున్న అలసటని, చిరాకుని సంధ్య కళ్ళు పట్టేశాయి.

'అన్నయ్యా వాళ్ళేరి?' రాజా అప్రయత్నంగా అడిగాడు. 'సినిమాకు వెళ్ళారు.' తల తిప్పకుండానే సమాధానమిచ్చింది. 'మరి నువ్వెందుకు వెళ్ళలేదు?' నాలిక చివరిదాకా వచ్చిన ప్రశ్నని బలవంతంగా నొక్కేశాడు. సంధ్య నాటకం చూస్తుంటే, 'ఇహ పై దారిని నువ్వు దయచేయి బాబూ' అన్నట్లుంది. సంధ్య నిర్లక్ష్యం చురుక్కుమన్పిస్తోంది. వచ్చినప్పటి నుంచి చూస్తూనే ఉన్నాడు. తనని చూస్తేనే, మొహం మీద కొట్టినట్లు అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోతుంది. సమయానికి వదిన కన్పడకపోతే, సంధ్యని అడగబోతే, ముందే ఏది కట్టేసినదానిలా అక్కణ్ణుంచి జారుకుంటుంది. ఒకవేళ అడిగినా, మహాకష్టంగా ముఖం పెట్టి, బలవంతంమీద అన్నట్లు చేస్తుంది. ఒక్క భోజనాల సమయంలో తప్పిస్తే, తనింట్లో ఉన్నప్పుడు ఆ ఛాయలకే రాదు. కాని తనెందుకో, ఎంత ప్రయత్నించినా [illegible] కోపం రావటంల్లేదు. పైగా,

అభిమానమే పెరుగుతోంది. తన ప్రవర్తనలో ఏం లోపం ఉందని, ఆ అమ్మాయి అలా దులపరించుకుంటుంది?' మృదు స్వభావుడైన రాజాకి సంధ్య ప్రవర్తన నొప్పి కల్గించగా, ఆత్మవిమర్శ చేసుకున్నాడు. 'ఒకవేళ మంజులసంగతి తెలిసి అలా ప్రవర్తించడం లేదు కదా?' భయంకరమైన అనుమానం మెరపులా మెరిసింది. 'ఎలా తెలిసి ఉంటుంది? వదినేమన్నా చెప్పిందా? అందుకే సంధ్య తనని ద్వేషిస్తున్నదేమో!' ఒక్కక్షణం ఈ భావంతో రాజామనసు తల్లడిల్లి పోయినట్లయింది. మరుక్షణంలోనే, విరక్తిగా నవ్వుకున్నాడు. 'తెలిస్తే నష్టమేముంది? పోనియ్! ఎలా అర్థం చేసుకున్నా తనేం పట్టించుకోడు' బ్యాగు టేబుల్ క్రిందకు తోసి లోపలికి వెళ్ళిపోయాడు. సంధ్య తనపట్ల బలంగా ఆకర్షించబడిందని, తనకు తెలియకుండానే, అతనిపట్ల ఆరాధనని పెంచుకొందని, అది బయటపెట్టడం యిష్టంలేక, తెచ్చుకొన్న కఠినత్వాన్ని ప్రదర్శిస్తున్నదని, రాజాకి యేమాత్రం తట్టినా, అతడి మనసుకి ఉపశమనం కల్గి ఉండేది.

సంధ్య నెమ్మదిగావచ్చి టీపాయ్ ప్రక్కనున్న సోఫాలో వాలింది. 'రాజావిమాస్తుంటే ఒంట్లో ఏం బాగోలేదని తెలుస్తూనేఉంది. లోపల ఏం చేస్తున్నాడు? శబ్దమేమీ విన పట్టంలేదు పాపం! భోజనంకూడా చేసినట్లు లేదు. ఇంత తొందరగా ఎందుకు వచ్చేసాడు?' ప్రశ్నలతో సంధ్య మనసు వేగిపోయింది, 'పోనియ్! తన కెందుకు.' అని పట్టనట్లు కూర్చోవడానికి, మనసు సుతరామూ ఒప్పుకోవడల్లేదు. అలా అని వెళ్లి అడగటానికి అంతకన్నా ధైర్యం చాలడంలేదు. నెమ్మదిగాలేచి, శబ్దం వేయకుండా రాజా గది దగ్గరకు వెళ్లి కిటికీలో నుంచి తొంగి చూసింది. అటువైపు తిరిగి, ఒకచెయ్యి తలకింద, యింకోచెయ్యి కళ్ళ మీద పెట్టుకొని పడుకున్నాడు. బట్టలన్నా మార్చలేదు. 'భోజనానికి లెమ్మని' అడుగుదామని ఎంత ప్రయత్నించినా, సంధ్య నోరు పెగల్లేదు. రాజా గదిదాకా మూడుసార్లు వచ్చినా అడగలేక పోయింది. నిస్పృహగా వచ్చి పడక కుర్చీలో పడుకుంది, ఆలోచనలు సాగటంలేదు. అలా ఎంతసేపు పడుకుందో సంధ్యకి తెలియలేదు. దగ్గరగా అడుగుల చప్పుడు వినపడటంతో, మత్తుగా కళ్లు సగంతెరచి చూసింది, అంతే! సంధ్య గుండె ఒక్కక్షణం కొట్టుకోవడం మానేసింది. బెడ్‌లైట్ వెల్గులో రాజా తనకేసి వస్తూ కన్పడ్డాడు. శాంతి మాటలు చప్పున బుర్రలో తిరిగాయి. జరగబోయే దాన్ని ఎదుర్కోవడానికన్నట్లు, శరీరంలో శక్తినంతా కూడదీసుకుంది. రాజా సంధ్య దగ్గరగా వచ్చి, వంగి, టీపాయ్ మీదున్న 'అమృతాంజనం' తీసుకొని నిశ్శబ్దంగా అక్కణ్ణుంచి వెళ్లిపోయాడు. దగ్గరగా రావడతో కళ్ళుమూసుకొని, ఊపిరి బిగపట్టింది. అంతా నిశ్శబ్దం. ఏమీకాలేదు. కళ్ళుతెరచి అయోమయంగా చూసిన సంధ్యకి రాజా కన్పడలేదు. దేనికవచ్చినట్లు? ప్రక్కన ఖాళీటీపాయ్ కన్పించింది వెక్కిరిస్తూ. అంతకుముందు, తను దాను కొని, అక్కడ పెట్టిన అమృతాంజనం సీసాలేదు.

కాని, రాజా వెళ్ళిన పది నిమిషాలవరకూ సంధ్య గుండెలో దడ, కాళ్ళల్లో వణుకు తగ్గలేదు. అనుమానం అర్థరహితంగానే మిగిలిపోయినందుకు, బరువు తీరినట్లు దీర్ఘంగా నిశ్వసించింది మొదటిసారిగా సంధ్య శాంతి మాటల్లోని నిజం శంకించింది. 'నిష్కల్మషంగా ఉండే రాజా అలాంటివాడై ఉండడు.' సంధ్య హృదయం నిజం చెప్పింది.

(ముగింపు పైపేజీ)



## సరికొత్త సత్యం

డా॥ సి. నారాయణరెడ్డి

సత్యం మా యింటిపేరు
సత్యపురి మా వూరు.

అయినా సత్యం విలువను
అవగాహన చేసుకోలేదు.

సత్యమంటే నగ్నమైందని
తాండవ నృత్యంకంటే ఉద్విగ్నమైందని

ఇన్నాళ్లూ అనుకునే వాణ్ణి
ఏవేవో కంచెలు పెంచుకునే వాణ్ణి.

ఇప్పుడు తెలిసింది
సత్యానికీ అందముందని.
చట్టాయిలోనూ హృదయ స్పందనముందని.

కాకుంటే

కాకులుదూరని కారడివిలో
చీమలుదూరని చిట్టడివిలో

ఒక అజంతా ఎలా పుట్టేది?
ఒక ఎల్లోరా ఎలా రూపుకట్టేది?

శ్రమజీవి చెమట బిందువులో
ఆణిముత్యమూ వుంది
అగ్నిగోళమూ వుంది.

పీడితుని వేడి నిట్టూర్పులో
పావురాయి మూలుగూ వుంది
చెకుముకిరాయి మిణుగురూ వుంది.

బ్రతుకంటే నిప్పులు కక్కడమూ కాదు
తప్పితప్పు కనుగుడ్లలో కుక్కడమూ కాదు.

జాట్లు పీక్కోవడమూ కాదు
ముట్టచుట్టుకుని పడుకోవడమూ కాదు.

బ్రతుకంటే ఉద్విగ్న చైతన్యం
జలవిద్యుత్తులో దాని బాంధవ్యం.

బ్రతుకంటే వర్షామేఘం
బీళ్లతో ఏళ్లతో దాని అనుబంధం.